


స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి

సీతానగరం : నవంబర్ 3న పార్వతీపురం జిల్లా కేంద్రంలో జరుగు యుటిఎఫ్ స్వర్ణోత్సవసభ విజయవంతం చేయాలని యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ విజ్ఞప్తి చేసింది. మండల శాఖ ప్రతినిధులు సోమవారం మండలంలోని పలు పాఠశాల లను సందర్శించి ఉపాధ్యాయులను ప్రత్యక్షంగా కలుసుకొని కార్యక్రమా నికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతరం పోరాడుతున్న యుటిఎఫ్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మర్రాపు గోవిందరావు, తెర్లి అప్పలనాయుడు, బూరాడ ఆదినారాయణ, ట్రెజరర్ డివి రమణ, మండల కార్యవర్గ సభ్యులు నాగులకొండ త్రినాథ్, దాలయ్య, జాగాన సింహాచలం పాల్గొన్నారు.

'ఉపాధి' కోసం యుద్ధం

- పోరుబాట పట్టిన వైసిపి సర్పంచులు
- దొడ్డిదారిన పనులు చేసేందుకు అధికార పార్టీ యత్నం
- మద్దతుగా నిలుస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం -2005లోని మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని కోరుతూ ప్రతిపక్ష వైసిపికి చెందిన పంచాయతీ సర్పంచులు పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని 450 గ్రామపంచాయతీల్లో సుమారు 80శాతం పంచాయతీలు వైసిపికి చెందినవే కావడంతో ఆయా సర్పంచులు చట్టానికి లోబడి పనులు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పంచాయతీల్లో పనులు గుర్తించడానికి సర్పంచుల ఆధ్వర్యాన గ్రామ సభలు నిర్వహించారు. పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వాటిని గ్రామసభల ఆమోదం పొందేలా చేశారు. మెజారిటీ పంచాయతీలు వైసిపి అధీనంలో ఉండడంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ పనులు వారికి నచ్చిన వ్యక్తితో చేయించాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. ఉపాధి హామీ చట్టంలో సర్పంచ్ ఆధ్వర్యాన గ్రామ సభలే సుప్రీం అని పేర్కొనబడి ఉన్నా చట్టానికి విరుద్ధంగా టిడిపి నాయకులు, కార్యకర్తల ద్వారా చేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని కోసం వెండర్ ఐడి సృష్టించి వారికి నచ్చిన కాంట్రాక్టర్ చేతనో, నాయకుల చేతనో పనులు చేయించాలని వ్యూహరచన చేస్తోంది. దీని కోసం తమ అధీనంలో ఉన్న అధికార యంత్రాంగాన్ని వినియోగించాలని చూస్తోంది. అధికారపార్టీ నాయకుల ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ఆ పనులు చేయడానికి రంగం చేస్తున్నారు. పంచాయితీ పరిధిలో పనుల గుర్తింపు నుంచి వాటిని చేపట్టే వరకు సర్పంచ్‌లే కీలకపాత్ర పోషించాలని చట్టం చెపుతున్నా దాన్ని నీరుగార్చే పనిలో అధికార ఉంది. వీరి సిఫార్సులకు అనివార్యంగా తలొగ్గాల్సిన పరిస్థితి అధికారులకు వుంది. అయితే వైసిపికి చెందిన సర్పంచులు గ్రామపంచాయతీల సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని భావిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇప్పుడు టిడిపి కూటమి ఎమ్మెల్యేలు, మంత్రి వున్నారు. అయితే ఈ నియోజకవర్గాల్లో స్థానిక సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలు మాత్రం వైసిపితోనే వున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మండల, జిల్లా స్థాయి అధికారులు మాత్రం ఇరకాటంలో పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.



సాలూరు ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న సర్పంచులు

జిల్లా అధికారులకు నోటీసులు

ఉపాధి హామీ చట్టం కింద పంచాయతీ సర్పంచ్‌లతో సంబంధం లేకుండా పనులు చేపడుతున్న తీరుపై వైసిపికి చెందిన సర్పంచులు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. గత రెండు నెలలుగా ఈ చట్టంలో వున్న మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని వారు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై కలెక్టర్ నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో పోరుబాట పట్టారు. పాచిపెంట మండలం కేసలి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానం మేరకు కలెక్టర్, డ్వామా పీడీ, గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ జిల్లా అధికారులు, డిఇ, ఎఇలకు లీగల్ నోటీసులు పంపించారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. పాచిపెంట మండలం యర్రడ్లవలస నుంచి కుమ్మరివలస వరకు ఉపాధి హామీ చట్టం కింద రూ.2కోట్లతో బిటి రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించారు. పాచిపెంట బిటి రోడ్డు నుంచి యర్రడ్లవలస వరకు రూ.1.6 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ సుతాపల్లి సాంబమూర్తి పనులు ప్రారంభించారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యాన పంచాయతీ తీర్మానం లేకుండా స్థానికేతురుడైన కాంట్రాక్టర్ సుతాపల్లి సాంబమూర్తితో అధికారులు పనులు చేపట్టడాన్ని ప్రశ్నిస్తూ సర్పంచ్ సత్తారపు నిర్మల, వార్డు సభ్యులు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. అదేబాటలో సాలూరు మండలానికి చెందిన వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఒ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ చట్టానికి లోబడి పనులు జరగకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా మండలంలో పంచాయతీల గ్రామసభల ఆమోదం లేకుండా కొన్ని పనులను గ్రామసభల తీర్మానాల్లో ఇరికించాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారని, తలొగ్గిన కార్యదర్శులను బదిలీ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎపిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ నాయకత్వంలో మెజారిటీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఫిర్యాదులు ఎంపిడిఒ అందజేశారు. ఇదే దారిలో జిల్లాలో వైసిపి ప్రాబల్యం ఉన్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలు పోరాటానికి సిద్ధమయ్యే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు:



పార్వతీపురంలో వినతిని అందజేస్తున్న నాయకులు, కార్మికులు

సమ్మె కాలపు హామీలను నెరవేర్చాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం, సాలూరు, పాలకొండ

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, నాయకులు జి.వెంకటరమణ, కాదా రాము మాట్లాడుతూ కరోనా కాలంలో పనిచేసిన కార్మికుల్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, పనిముట్లు సరఫరా చేయాలని, సంపూర్ణ పారిశుధ్య నివారణకు తగు సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పర్మినెంట్ సర్వీసు ఉంటే రూ.75 వేలు, ఆప్కాస్ ఒక్కొక్క ఏడాది రూ.2వేలు చెల్లించాలన్నారు. ప్రమాద మృతులకు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియో, దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా జీతాలు, సెలవులు అమలు మొదలైన హామీలకు నేటికీ జీవోలు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్లు, డిఎ బకాయిల వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు. క్లాప్ డ్రైవర్లకు చట్టబద్దంగా జీతాలు, సెలవులు అమలు కావడంలేదన్నారు. చనిపోయిన మృతుల కుటుంబాలకు ఉద్యోగం, నష్టపరిహారం చెల్లించాలన్నారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో పర్నీచర్ దొంగతనంపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పార్వతీపురంలో జరిగిన కార్యక్రమంలో ఆప్కాస్ విధాన కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ,బంగారు రాజేష్, నాగవంశం శేషు, నాగవంశం నిర్మల, ఇప్పలమ్మ, పాపులమ్మ, గంగయ్యలు, పరిమిక వరదరాజు, పర్మినెంట్ కార్మికులు మంగళగిరి శ్రీను, గుంట్రెడ్డి గంగరాజు, నాగవంశం శివ, మేస్త్రీలు కోల చంద్ర, సాసుబిల్లి శ్రీధర్, ఇంజినీరింగ్ కార్మికులు తాడ్డి విన్సెంట్, క్రాంతి, సాలూరులో జరిగిన కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు టి.రామారావు, టి.శంకరరావు, వాటర్ ఇంజినీరింగ్ కార్మికులు రామ్‌చంద్, సంతోష్, పాలకొండలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవి, కోశాధికారి పి.వేణు, సిహెచ్ శ్రీదేవి, పడాల విమల, సింహాచలం, ఎన్. సాయి, పి.శ్రీనివాసరావు, రఘు పలువురు పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



దాగరవలస-ఎగువ దాగరవలస రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

రూ.4.20 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కూర్మరాజుపేట, కొత్తవలస పంచాయతీలు చంద్రపువలస, చిన్నవలస, గుంద్రపువలస గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చంద్రపువలస నుంచి ముగడవలస బిటి రోడ్డుకు రూ.1.60 కోట్లు, చిన్నయ్యవలస నుండి పణుకువలస జంక్షన్ వరకు రూ.50 లక్షలు, గుంద్రపువలస నుండి ఖరాసువలస వరకు రూ .1.55 కోట్లుతో కలిపి రూ.3.65కోట్ల నిధులతో బిటి రోడ్డులకు శంకుస్థాపనలు చేశారు. దాగరవలస నుండి ఎగువ దాగరవలస వరకు రూ.2.80 కోట్లతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమాదేవి, పట్టణ, పాచిపెంట, మక్కువ,య సాలూరు మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పిన్నింటి ప్రసాద్, చలుమూరి వెంకటరావు, ఆముదాల పరమేష్, సర్పంచ్ ఒంటి లక్ష్మి, కరాసువలస ఎంపిటిసి రమాదేవి, యుగంధర్, చొక్కాపు వెంకటి, శ్యామ్, భాస్కరరావు, త్రినాధ్, న్రాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

పార్వతీపురం : విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు ప్రోత్సహం అవసరమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.మంజుల వీణ అన్నారు. జిల్లాలో గల 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల ఎకడమిక్ ప్రోగ్రెస్ ను తల్లిదండ్రులకు తెలియజేసారు. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, ఇంటి దగ్గర చదివేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళాశాలలో ప్రతిరోజు సాయంత్రం 4 నుండి 5గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామ న్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. త్రాగు నీటి అవసరాలను ప్రతి ఆవాసంలో గుర్తించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. తాగు నీటికి మండల స్థాయి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, ఏ గ్రామంలోనూ త్రాగు నీరు లేదు అనే ప్రశ్న తలెత్తరాదని ఆయన చెప్పారు. వేసవిలో కూడా ఎక్కడా తాగు నీరు కొరత లేకుండా శాశ్వత పరిష్కారం ఉండాలని, స్పష్టమైన సర్వే చేయాలని స్పష్టం చేశారు. జల్ జీవన మిషన్ పనుల ప్రగతి వివరాలు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారులతో స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సమీక్షించారు. రహదారుల పనులను క్వాలిటీ తనిఖీలు పూర్తయిన తర్వాతే బిల్లుల చెల్లింపు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రగతిలో ఉన్న పనులు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఎంపిసిసి పనులు 14 మంజూరు కాగా, ఇప్పటి రెండు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. భామిని ఏకలవ్య మోడల్ పాఠశాల భవనాలు త్వరగా పూర్తి చేయాలని, దీనిపై ఇంజినీర్ ఇన్ చీఫ్ దష్టిలో పెట్టాలని ఆదేశించారు. పనులు వేగవంతం కావడానికి గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తాగునీరు, రహదారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అంగన్వాడీ భవనాల్లో మరుగుదొడ్లు, తాగు నీరుకు ఇచ్చిన డిజైన్‌ను పక్కాగా అనుసరించాలని ఆయన అన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ పి రమాదేవి, డిఇఇ సింహాచలం, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, ఇతర శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అసంపూర్తిగా ఏకలవ్య పాఠశాల నిర్మాణం

ప్రజాశక్తి - భామిని

గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతిలో ఉన్నతంగా విద్యను అందించాలని ఐదేళ్ల క్రితం రూ.12 కోట్లతో ఏకలవ్య పాఠశాలను ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి కాలేదు. ఐదేళ్లుగా ఈ పాఠశాల విద్యార్థులకు కొత్తూరు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 6 నుండి ఇంటర్ వరకు 420 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తూరు పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో వసతి, తరగతులు నిర్వహణ ఇబ్బందికరంగా ఉండడం, అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో భామినిలో ఏకలవ్య పాఠశాలను సోమవారం ప్రారంభించారు. అయితే ఇక్కడ తరగతుల గదులు, వంట నిర్వహణ గదులు మినహాయించి మిగిలినవి నిర్మాణంలో జరుగుతున్నాయి. పాఠశాలలో రూ.40 లక్షలతో మొదలు పెట్టిన సిసి రోడ్డు కూడా పూర్తి కాలేదు. రూ.12 కోట్లతో నిర్మించిన పాఠశాల అట్టహాసంగా, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రారంభించాల్సి ఉంది. నిరాడంబరంగా ప్రారంభించారు. ఇదిలా ఉండగా గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఈ పాఠశాలను మంజూరు చేయగా, అధికారుల నిర్లక్ష్యం వల్ల అమలుకు నోచుకోవడంలేదన్న అంశానికి ఈ పాఠశాల అద్దం పడుతుంది.

పిహెచ్‌సి అభివృద్ధి సమావేశం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పిహెచ్‌సిలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం వచ్చిన నిధులు ఏఏ అంశాలకు ఖర్చు చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి ఉందన్న అంశాలపై చర్చించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులకు డాక్టర్ కిరణ్ కుమార్ వివిధ అంశాల గురించి వివరించారు. పిహెచ్‌సి అభివృద్ధి పనులకు సంబంధించి కమిటీ ఆమోదం కోరుతూ తీర్మానం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, సర్పంచ్ వెదుళ్ల సింహాచలవమ్మ, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, మాజీ సర్పంచ్ అక్యాన తిరుపతిరావు, సభ్యులు పలు సూచనలు, సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో యుడిసి పి.సాయికృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

500 మీటర్ల పరిధి తర్వాతే ఇసుక తవ్వకాలు

పిజిఆర్ఎస్‌కు పోటెత్తిన అర్జీలు

ప్రజాశక్తి - సీతంపేట

ఇసుక రీచ్‌ల వద్ద ఉన్న బ్రిడ్జిలు, తాగు నీటి పథకాలు వంటి నిర్మాణాలకు ఐదు వందల మీటర్ల పరిధి తర్వాతే మాత్రమే ఇసుక తవ్వాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని స్థానిక ఐటిడిఎ ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తు అర్జీలు పోటెత్తాయి. 190 వరకు దరఖాస్తులు అందాయి. పాలకొండ మండలం నుండి పలువురు ఇసుకపై విజ్ఞాపనలు సమర్పించడంపై ఆయన స్పందిస్తూ నిబంధనలు మేరకు 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు జరపరాదని స్పష్టం చేశారు. అటువంటి ప్రదేశాల్లో తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని, వాహనాలను సీజ్ చేయాలని ఆయన తహసీల్దార్లను ఆదేశించారు. మౌలిక సదుపాయాల పనులు మంజూరు చేసిన మూడు నెలలలో పూర్తి చేయాలని ఆయన అన్నారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలకు స్పందించి వెంటనే వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎపిఒ జి.చినబాబు, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె చలపతిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 106 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పిఆర్ఎస్) వచ్చే అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అసుతోశ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. సబ్ కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో 106 మంది అర్జీదారులు తమ సమస్యలను సబ్ కలెక్టర్, డీఆర్వోకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

బాల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

బాల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అదనపు జిల్లా పర్యవేక్షణ అధికారి బి.వి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అనుకునేవారు నిర్దేశించిన ప్రొఫార్మాలో దరఖాస్తుతో పాటు సంబంధిత పత్రాలు జతచేసి నవంబర్ 11లోగా బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమశాఖ సంచాలకులకు సమర్పించాలని ఆయన సూచించారు. సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాల్సిన డాక్యుమెంట్ల చెక్ లిస్టులను http://wdcw.ap.gov.in వెబ్ సైటు నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలని, సాఫ్ట్ కాపీలను cci.reg2024@gmail.com మెయిల్‌కి పంపాలన్నారు. సమాచారానికి 91000 45398, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ (94403 32581) ను సంప్రదించ వచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

బకాయిల విడుదలకు ఎస్ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి - కురుపాం

పెండింగ్‌లో ఉన్న ఉన్నత విద్య, వసతి దీవెనల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం.శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా, వసతి దీవెన బకాయిలు పెండింగ్‌లో ఉన్న రూ.3480 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, స్థానిక గిరిజన సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేసి, గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో అదనంగా బోర్ ఏర్పాటు చేసి, ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలని ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ ఎం.రవణమ్మ నిరసన వద్దకు వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. హామీలు నెరవేర్చకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జియ్యమ్మవలస బాధ్యులు కె.మల్లేష్, సభ్యులు ఎ.అన్నాజీ, చంటి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : విద్యాదీవెన, వసతిదీవెన బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సీతానగరంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీ సభ్యులు కె.డేవిడ్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సురేష్,అభి, దిలీప్, కిరణ్ మహి,మేఘన, విద్యార్థులు పాల్గొన్నారు



సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి : ఎఎఫ్ఐ

సాలూరురూరల్ : నియోజక వర్గ కేంద్రంలో విద్యారంగంలో సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పట్టణంలో వివిధ కాలేజీల్లో నుండి విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ర్యాలీని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ ఈనెల అక్టోబర్ 27 నుంచి 30 వరకు మండలాల్లో ధర్నాలు, నవంబర్ 2 నుంచి 4 తేదీ వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు నవంబర్ 6న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి.సింహాద్రి, జి.సంజీవ్, కళ్యాణ్ జానీ, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. తొలుత స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్ నుండి రెవెన్యూ కార్యాలయం వరకు వరకు ర్యాలీగా నిర్వహించి ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కె.డేవిడ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలతో పాటు బలిజిపేటలో హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భారీ గొయ్యిలో దిగిపోయిన లారీ

15 గంటల మేర నిలిచిపోయిన వాహనాలు

అవస్థలు పడ్డ వాహనదారులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని పార్వతీపురం- కూనేరు మీదుగా రాయగడ వెళ్లే అంతర రాష్ట్ర రహదారిపై 15 గంటల పాటు ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లుపై వర్షపు నీరు చేరింది. దీంతో కొమరాడకు సమీపాన అంతర్రాష్ట్ర రహదారిపై గల గోతులో లారీ దిగిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇలాంటి సంఘటనలు ఒక్కటి, రెండు రోజులు కాదు గడిచిన నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో ఆ రోడ్లో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

సోమవారం ఉదయం 11 గంట సమయంలో కొమరాడ సమీపాన గోతులో లారీ దిగబడి పోయింది. దీన్ని బయటకు తీసుకు రాగా మళ్లీ రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న మరో లారీ గోతిలో దిగుబడిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది.

సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో లారీ డ్రైవర్లు ఆకలితో అటమిస్తున్నారు. వివిధ వైద్య సేవల నిమిత్తం వెళ్తున్న ఎమర్జనీ వాహనాలు సైతం నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ట్రాఫిక్ అంతరాయం వల్ల ఆర్టీసీ బస్సులు సైతం రాకపోకలకు ఆటంకం ఏర్పడడంతో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ఎప్పటికప్పుడు లారీలు దిగుబడిపో వడంతో నిత్యం లారీ డ్రైవర్లు, వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తు న్నారు. ఇది ఏమైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుపై ఉన్న గోతుల కప్పి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై గోతులు కప్పాలని సిపిఎం నిరసన

ఇదిలా ఉండగా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కప్పి ట్రాఫిక్ అంతరం లేకుండా ప్రమాదాలను నివారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు అంతర్‌రాష్ట్ర రహదారి వద్ద నిరసన తెలిపారు. నాలుగేళ్లుగా పార్వతీపురం నుండి ఒడిశా వెళ్లే మార్గంలో ప్రతిరోజు వాహనదారులు గంటల కొలది ట్రాఫిక్‌లో ఇరిక్కిపోవడంతో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. గంటల కొలదీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్ స్పందించి ఈ గోతులను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా వద్దకు కొమరాడ ఎస్సై నీలకంఠం, ఆర్‌అండ్‌బి జెఇ రాజేంద్ర వచ్చి నవంబర్ 1నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, వాహనదారులు, లారీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



గొయ్యిలో దిగబడిపోయిన లారీ

శాంతి భద్రతల్లో పోలీసుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శాంతి భద్రతల్లో పోలీసుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం పోలీస్ మల్టీపర్పస్ హాలులో నిర్వహించిన మాస్టర్ హెల్త్ చెకప్ వైద్య శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎంతో కీలకంగా నిలుస్తున్న పోలీసుల సేవలు ఎనలేనివని అన్నారు. జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారిగా మెగా వైద్య శిబిరం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. వైద్య శిబిరానికి పిలవగానే హాజరైన వివిధ విభాగాల వైద్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి దిలీప్ కిరణ్, ఎఎస్‌పి అంకిత సురాన, పోలీసు అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనుల గోడు పట్టని అధికారులు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ అధికారులకు గిరిజనుల గోడు పట్టడం లేదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు తెలిపారు. మండలంలో గతంలో 1170 ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, బిల్లులు రాక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం కాలంలో ఎక్కడ ఒక్క ఇల్లు కూడా గృహప్రవేశం జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అరకొర ఇంటి బిల్లు సరిపడక, ఇసుక ఇతర సామాగ్రి తరలించలేక నిర్మాణాలు సకాలంలో పూర్తికావడం లేదన్నారు. గత 5 సంవత్సరాల నుంచి గృహ నిర్మాణ శాఖకు పర్మినెంట్ ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్ లేరన్నారు. ఈ విషయం పిఒ, జిల్లా కలెక్టర్ పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఎ. భాస్కర్ రావు మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యత మౌలిక వసతుల కల్పనకు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా గిరిజనులకు ఇళ్ల నిర్మాణానికి పర్మినెంట్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 150 రోజులు కావస్తున్నా సీతంపేటలో ఇసుక కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఇసుక రవాణాకు అదనంగా ఐటిడిఎ ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.

కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జె.రామారావు అధ్యక్షత వహించగా, డివిఇఒ మంజులవాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌కు తగిన అంశాల గురించి చర్చించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి లెక్చరర్ల కృషితో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉందని, కళాశాలలో జాయిన్ చేసిన తర్వాత విద్యార్థుల ప్రోగ్రెస్‌ను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు కళాశాలలో అధ్యాపకులను సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఇంటి వద్ద వారు చక్కగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

పార్వతీపురాన్ని వీడని ఏనుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

20 రోజులు క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు ప్రస్తుతం పెద్ద బొండపల్లి, సూడిగాం, మూడెడ్ల వలస గ్రామాల మధ్యలో ఉన్న తోటలలో సంచరిస్తూ గ్రామీణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఏనుగు దాడిలో పెద్ద బొండపల్లి గ్రామానికి చెందిన దేవా బత్తుల యాకోబు మరణంతో ప్రజలు రాత్రిపూట బయటకు రావడానికి, పొలాల్లో పండిన తమ పంటను చూసుకోవడానికి భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను మైదాన ప్రాంతాల నుంచి అటవీ ప్రాంతాల వైపు తరలించాలని కోరుతున్నారు.

జెఎఫ్ఒ సంఘం అధ్యక్షుడిగా మనోజ్ కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఉమ్మడి విజయనగరం జిల్లా జూనియర్ అటవీశాఖ అధికారుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మణరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఉభయ విజయనగరం అటవీశాఖ జూనియర్ అసోసియేషన్ అధ్యక్షునిగా పార్వతీపురం అటవీ సెక్షన్ అధికారి ఎం.మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా భారతి, ప్రధాన కార్యదర్శిగా కెవిఎస్ రాజు, సంయుక్త కార్యదర్శిగా జగదీష్ కోశాధికారిగా ఎం. రమేష్‌ను ఎన్నుకున్నారన్నారు. వీరితో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అడవుల రక్షణ, సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘ ప్రతినిధులతో పనిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. ఏకగ్రీవ ఎన్నికలకు సహకరించిన అందరికీ నూతన కార్యవర్గం అభినందించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని గాదిలవలస జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి పి. శ్రీచరణ్ శ్రీకాకుళం జిల్లాలో నవంబరు 2,3,4 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శంకర్రావుతో పాటు శీను, జగదీష్, రామకృష్ణదొర, ఉపాధ్యాయులు, కోచ్ లక్ష్మణ్,

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో కురుపాం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి జరిగిన పోటీల్లో పంటల రోహిత్, కందుల లక్ష్య, కె.సాయికుమార్‌ల టీమ్ రెండవ స్థానం సాధించిందన్నారు. వీరికి జిల్లా విద్యా శాఖాధికారి ఎన్‌టి నాయుడు షీల్డ్ అందజేశారని జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సందర్భంగా విద్యార్థులకు పాఠశాల సిబ్బంది తోటి విద్యార్థులు అభినందించారు.

గ్రామ సభకు 45 దరఖాస్తులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో చలివేంద్రి సచివాలయం పరిధి జె.గోపాలపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన భూ రీ సర్వే సమస్యల పరిష్కార గ్రామసభకు 45 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా మ్యుటేషన్, ఎల్‌బిఎంఎస్, విస్తీర్ణంలో కరప్షన్ తదితర రకాలైన 25 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిజి ప్రసాదరావు, విఆర్ఒ జి. ఎల్లయ్య, గ్రామ సర్వే శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు అధిక సంఖ్యలో జరగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు అధిక సంఖ్యలో జరగాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సోమవారం టిడిపి మండల కన్వీనర్ అలా రాంబాబు అధ్యక్షతన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామ రాజు, రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్ర దేవ్ తో పాటు తెలుగుదేశం పార్టీ కేడర్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వీరఘట్టం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న సుమతి

మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైసిపి మండల ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, సుమతి దంపతులు సోమవారం పాలకొండ మండల కేంద్రంలో పలు దేవాలయ వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కుమారుడు ముఖేష్ రెండో వర్ధంతి సందర్భంగా లక్ష్మణరావు, సుమతి ఆర్థిక సహాయం తో మన ఆత్మీయ కుటుంబం పేరుట అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు లక్ష్మణరావు, సుమతీలు తెలిపారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలోని నగుళ్ళు దబ్బగెడ్డ గ్రామం నుంచి పలువురు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలోని గ్రామానికి చెందిన పూజారి వెంకట్రావు నేతృత్వంలోనే పలువురు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి తిరుపతిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండిఎం, శానిటేషన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తొలుత స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఎంఇఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, మండల కార్యదర్శి ఎం.కాంతారావు సిఐటియు సీనియర్ నాయకులు ఎ.భాస్కర్‌రావు మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా వర్తింప చేయాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలతో సమావేశాలు పెట్టాలని, టిఎ ఇవ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎపి మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం



బలిజిపేట : నిరసన తెలుపుతున్న ఎండిఎం కార్మికులు

సీతంపేట మండలం కార్యదర్శి ఎన్.రొయ్యబారి, కె.ఉష, వి.చామంతి, ఎం.విలాసవతి, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఎస్.సంతోషి, పి.రమాదేవి, బి.రోజామణి, వి.ప్రశాంతి, టి.అంజలి, పి.వరలక్ష్మి, ఎం.సరస్వతి, ఎస్.సంతోషితో పాటు స్కూల్ స్వీపర్స్ వంట కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతానగరం: మధ్యాహ్నం భోజనం ,వంట కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపి, ఎంఇఒ సూరిదేముడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సిహెచ్ ఆదిలక్ష్మి, పి.కుమారమ్మ, కె.రమణమ్మ, ఎస్.కురమమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను తొలగించవద్దని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన ఎంఇఒకు వినతి పత్రాన్ని అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, పై సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుహాసిని, గాయిత్రి, వెంకటరావు పాల్గొన్నారు.

బలిజిపేట: మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు ఆధ్వర్యాన ఎంఇఒకు వినతిని అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని మధ్యాహ్నంభోజన పథకంలో పనిచేసే వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒకు సిఐటియు నాయకులు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, మండల నాయకులు కృష్ణ, దానమ్మ, పార్వతి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సూర్య మండల నమూనాలో కూరగాయల సాగు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక గిరిజన బాలికల హైస్కూల్లో ప్రకతి సేద్య సిబ్బంది ఆధ్వర్యంలో సూర్య మండల నమూనాలో కూరగాయలు నాటించారు. ఈ సందర్భంగా ఎఒ కె.తిరుపతి రావు మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాలు పండించవచ్చని, భూమి అంతటినీ గాలి, వెలుతురు ధారాళంగా ప్రవహించడం వల్ల చీడ, పీడల ఉధృతి ఈ నమూనాలో తక్కువగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.వి శారదా దేవి, డిప్యూటీ వార్డెన్ స్వర్ణలత, ఎల్.శ్రీరాములునాయుడు, సిఆర్పీలు కర్రి శ్రీను, తిరుపతి నాయుడు, విజయ్ సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

సీతానగరం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు -2024 పురస్కరించుకొని పార్వతీపురం పోలీసు కాన్ఫరెన్సు హాల్‌లో పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచిత మెగా మెడికల్ క్యాంపును, రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్‌పి ఎస్‌వి.మాధవ్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో జోగంపేట గ్రామానికి చెందిన యువకులు జి విశ్వనాథ్, వెంకటేష్, సలీం రక్తదానం చేశారు.

పాల ధర తగ్గింపుతో రైతులకు అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పాల సేకరణ ధరలు తగ్గించడంతో పాడి రైతులకు చాలా అన్యాయమని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి పాల రైతుల సంఘం (ఎపి రైతు సంఘం అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని డి.ములగలో పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని పాడి రైతులతో అధ్యక్షులు తాన శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విశాఖ డెయిరీలో విక్రయిస్తున్న ఆవు పాలపై మూడు రూపాయల నుండి నాలుగు రూపాయల వరకు ధరలు తగ్గించడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా రైతు సంఘం, పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాజువాక విశాఖ డెయిరీ ప్రధాన కేంద్రం వద్ద జరిగే మహాధర్నాకు పాల రైతులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు పాడి రైతులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

సీతానగరం: విశాఖపట్నంలో మంగళవారం జరగబోయే పాల ఉత్పత్తిదారుల ధర్నాను జయప్రదం చేయాలని పాల ఉత్పత్తి దారుల రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్ కోరారు. మండలంలోని రెడ్డివాని



సీతానగరం : మహిళా రైతులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

వలస పాల ఉత్పత్తిదారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డైరిని పూర్తిగా నాశనం చేయడానికి కుట్ర పన్నుతున్నారని పాల ఉత్పత్తిదారులకు లీటర్ పాలుపై పది రూపాయలు తగ్గించారని అన్నారు. విశాఖలో జరగబోయే ధర్నాలో పాల ఉత్పత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు. ఈ సమావేశంలో పాల ఉత్పత్తిదారుల జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, ఉత్పత్తిదారుల సభ్యులు సత్యనారాయణ, లక్ష్మనాయుడుతోపాటు ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- సీతానగరం

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సోమవారం తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిచ్చింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ విఆర్‌ఎలను నిబంధనలకు విరుద్ధంగా సంబంధం లేని (నైట్ వాచ్మెన్, ఇసుక రీచులు, రైస్ మిల్లు) పనులు చేపిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి వేతనాలు చెల్లించాలని, అర్హులైన వారిని గుర్తించి వాచ్మెన్, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్ లాంటి ఖాళీల స్థానంలో ప్రమోషన్ కల్పించి నియమించాలని కోరారు. కనీస వేతనాల చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 4వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో విఆర్‌ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి సూరయ్య, సురపాటి జోగులు, విఆర్‌ఎలు ఆనంద్, కిషోర్, గురువులు, చిట్టెమ్మ, అసిరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలపై 4న కలెక్టరేట్ ధర్నా

కురుపాం: విఆర్‌ఎల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ 4వ తేదీన మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షుడు జి. ఈశ్వరరావు తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక తహశీల్దార్ ఎం. రవణమ్మకు ధర్నా నిమిత్తం వినతిపత్రం అందించామన్నారు. జిల్లాలో ఉన్న అందరు విఆర్‌ఎలు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల విఆర్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

జిఒ నెంబర్ 3 పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో వున్న ఏకలవ్య పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రంజిత్ కుమార్ ఆధ్వర్యాన పాఠశాలల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం, కొమరాడ, అనసభద్ర ఏకలవ్య పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మెనూ అమలు చేయడం లేదని, పర్యవేక్షణకి అధికారిని నియమించాలని కోరారు. పార్వతీపురం మండలం లిడికివలస గిరిజనులకు 2020లో ఇచ్చిన పట్టాలకు వన్ బి, పాసుపుస్తకాలు మంజూరు చేయాలని, రైతు భరోసా, రుణ సదుపాయం పొందే అవకాశం కల్పించాలని కోరారు. జీవో నెంబర్ 3 స్థానంలో మరో కొత్త జీవో జారీ చేయాలని, గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి విడుదల చేయాలని కోరారు. అనంతరం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పల్లా సురేష్, గిరిజనులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని, పురపాలక సంఘం అభివృద్ధి ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఎమ్మెల్యే విజయ్ చంద్ర మున్సిపల్ ఉద్యోగులను కోరారు. సోమవారం పట్టణంలో ఉన్న మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుతో పాటు కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్సిపల్ తాగునీరు విభాగం సిబ్బంది పనితీరు బాగాలేదని, సమయపాలన పాటించడం లేదనే ఫిర్యాదులు పలు వార్డుల నుంచి వస్తున్నాయని, సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహించకుండా పనితీరు మెరుగుపరుచుకుని పనిచేయాలని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్యానికి, తాగునీటికి మరింత ప్రాధాన్యత పెంచాలని ఆదేశించారు. తాగునీటి సమస్యపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సమస్య లేకుండా ప్రతి వార్డుకీ ప్రతిరోజు తాగునీరు అందేలా



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

చర్యలు చేపట్టాలని చెప్పారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎక్కడైనా లైట్లు మరమ్మతులకు గురైతే తక్షణం వాటిని సిబ్బందితో ఏర్పాటు చేసే దిశగా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. వివిధ శాఖలపై ఉన్న సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టాలి అన్న అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మేనేజర్ జి.లక్ష్మి, ఎఇలు సన్యాసిరావు, అప్పారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొల్లలో పల్లె పండగ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పొల్ల గ్రామ సచివాలయం పరిదిలో పల్లె పండుగ పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పొల్లలో గ్రీవెన్స్‌లో నిర్వహించారు. వచ్చిన వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆయా శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముందుగా గిరిజనుల వద్ద సమస్యలు విన్నారు. అనంతరం ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పొల్ల గ్రామ సచివాలయం సిబ్బంది, ఇఒపిఆర్‌డి కె.సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

దీపావళిలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకొని ప్రవర్తించాలని సాలూరు శ్రీ వేంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆవరణలో 'దీపావళిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. అందరూ కాటన్ దుస్తులు వేసుకోవాలిని, బిగుతుగా ఉన్న దుస్తులు ఎట్టి పరిస్థితిలల్లో వేసుకోకూడదుని, బాంబులు జోలికి వెళ్లకుండా ఉండాలిని, ఇంటి ముందు డ్రమ్ములతో నీరు ఉంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే దీపావళి సామాగ్రిని వాడుకోవాలిని, వంటగదిలో గ్యాస్ సిలందర్ దగ్గర ఏ బాంబులు ఉంచకూడదనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరక్టర్ గులిపల్లి మల్లేష్, ప్రధానోపాధ్యాయులు కోడూరు లక్ష్మి, ఈశ్వరమ్మ, అరుణ, రమ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎస్.ఐ.ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం డోకిశీల పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు నమోదు, రోగుల ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించారు. ప్రతీ రోజూ నమోదు అవుతున్న ఒపి, ఐపి వివరాలు పరిశీలించారు. అనారోగ్యం బారిన పడి ఆసుపత్రికి వచ్చే వారికి సమస్యను స్పష్టంగా అడిగి తెలుసుకొని తగు చికిత్స అందించాలన్నారు. అవసరమైన వారికి వార్డులో ఉంచి వైద్య సేవలందించాలన్నారు. ప్రసవాలు గదిని, కాన్పుల రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సూచనలు చేశారు. అనంతరం పిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి. ఐశ్వర్య, కె. కౌశిక్, డిఎస్ఒ శంకర్, సూపర్‌వైజర్స్ శ్రీనివాసరావు, జయ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - భామిని

క్షేత్ర స్థాయి సమస్యలు దశలు వారి పరిష్కారానికి దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలం కేంద్రంలో సోమవారం టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భామిని మండల



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పరిధిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, స్థానిక సమస్యలు ను కార్యకర్తలు ఎమ్మెల్యేకి వివరించారు. ప్రధానంగా భామిని ప్రధాన రహదారి పై గోతులు పూడ్చాలని మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు తెలిపారు. స్థానిక కార్యకర్తలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతీ అంశం, శాఖల సమన్వయంతో పరిస్కారం చేస్తానని, కొన్ని అంశాలు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రవి నాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, జనసేన మండలి అధ్యక్షులు రుంకు కిరణ్, టిడిపి సభ్యులు బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, కోరాడ రాజేష్, అశోక్, గురిబిల్లి లక్ష్మిపతి, కొల్ల మధు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులకు పింఛను సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల కళాకారులు సోమవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామైన ఎం. రాజపురం క్యాంపు కార్యాలయంలో తమకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని నాలుగు దశాబ్దాలుగా ఇదే వృత్తిని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నామని కూలి చేస్తే గాని పొట్ట నిండని పరిస్థితి ఉందని చెప్పారు. జీవనోపాధి మెరుగుపరిచేందుకు తమకు పింఛన్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి కళాకారులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముద్ద వెంకటరమణ, తప్పెటగుళ్ల కళాకారులు పాల్గొన్నారు.

బాణాసంచా ధరలు నియంత్రించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దీపావళి మతాబు సామాన్ల ధరలపై నియంత్రణ విధించాలని అమ్మకం కేంద్రాల వద్ద ధరల పట్టిక పెట్టించాలని, మౌలిక వసతులు కల్పించి రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, అధ్యక్షులు సంచాన ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ కేశవనాయుడుకు వినతిని అందజేశారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని మతాబు సామాన్లు అమ్మే వర్తకులు అత్యధిక ధరలకు అమ్మకాలు జరిపి ప్రజలను నిలువ దోపిడీకి గురి చేస్తున్నారని, ఈ దోపిడీని నివారించేందుకు అధికార యంత్రాంగం



డిఆర్ఒకు సమస్యను వివరిస్తున్న నాయకులు

చర్యలు చేపట్టాలని కోరారు. అమ్మకందార్లు లైసెన్స్‌లో పేర్కొన్న నిబంధనలను తూచా తప్పకుండా పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనికి డిఆర్ఒ స్పందిస్తూ మతాబు సామాన్లు అమ్మకందారులతో సమావేశం ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగా 1/70, పీసా చట్టాలు

ప్రజాశక్తి - కురుపాం

ఎర్ర జెండా పోరాటాల ఫలితంగా 1/70, పీసా చట్టం వచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మామిడి మానుగూడలో సిపిఎం శాఖా మహాసభలు నాయకులు బిడ్డిక వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభ స్ఫూర్తితో చెక్‌డాం నిర్మాణానికి గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, నాయకులు కె.చిన్నప్పన్న, కె.రాజారావు, బి.లక్ష్మణరావు, కె.బాలరాజు, బి.గుడాయ్ పాల్గొన్నారు.

ధోనుబాయిలో నేత్ర శిబిరం

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమాజ్ పరివర్తన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 22 గ్రామాల నుండి 50 మంది వరకు నేత్ర పరీక్షలకు హాజరయ్యారు. 10 మంది కంటి ఆపరేషన్లు చేయించుకోడానికి ముందుకు వచ్చారని సమాజ్ పరివర్తన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యం. నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూరంగి వెంకునాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారి భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

వాలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ ఎఐటియుసి పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీగా వెళ్లి డిఆర్ఒ కేశవనాయుడకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలలో 2.20లక్షల మంది వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేడయంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలు అందించారన్నారు. గత నాలుగు నెలలుగా వాలంటీర్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం ఇవ్వలేదని, కనీసం అటెండెన్స్ కూడా వేసుకొనే అవకాశం కల్పించడం లేదని, ఎన్నికలకు ముందు వాలంటీర్స్ అందరికి న్యాయం చేస్తామని నెలకు పదివేల రూపాయలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి మోసం చేశారని చెప్పారు. గత ప్రభుత్వ రాజకీయ ఒత్తిళ్లతో బలవంతపు రాజీనామాలను రద్దుపర్చి వారిని కొనసాగించాల కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి దుర్గారావు, ఉపాధ్యక్షులు బలగ రాధ, పెద్ద ఎత్తున వాలంటీర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కురుపాం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసు అమరవీరుల త్యాగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మహిళలపై అరాచకాలు నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గూర్చి వివరించి మీ గ్రామాల్లో యువతకు, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ గోవిందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.